రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లో రోడ్ల ప్యాచ్ వర్క్‌తో పాటు మరమ్మతు పనుల కోసం రూ. 57 లక్షలు మంజూరయ్యాయని కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ... వర్షాల నేపథ్యంలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలలోని రోడ్లు పూర్తిగా గోతులమయంగా మారాయన్నారు. ప్రస్తుతం ప్రధాన రహదారులపై ఉన్న గోతులపై ప్యాచ్ వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్యాచ్ వర్క్ పూర్తి చేసి ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు.

సెక్యూరిటీ గార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సెక్యూరిటీ గార్డులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఎ.చెన్నయ్య గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇంటి పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబం ఆదరవు కోల్పోయింది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న గార్డులు అందరూ పెద్ద మనుసుతో తమ ఒక రోజు వేతనాన్ని చెన్నయ్య కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఓ యాదగిరి, సంఘం నేతలు డి.సామ్య, రాము, నర్సింహా, బాలయ్య, హరికృష్ణ యాదయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో తెగిపడిన విద్యుత్ తీగలకు మరమ్మతు

పడవలో వెళ్లి మరమ్మతు చేసిన ట్రాన్స్‌కో సిబ్బంది

శంషాబాద్ రూరల్: చెరువులో తెగిపడిన విద్యుత్ తీగలను ట్రాన్స్‌కో సిబ్బంది పడవలో వెళ్లి మరమ్మతులు చేపట్టారు. మండలంలోని పెద్దతూప్ర శివారులో ఉన్న మైసమ్మ చెరువులో శనివారం 11 కేవీ విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. దీంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. అంతేకాకుండా తెగిపడిన తీగలతో చెరువు నీళ్లకు కరెంటు షాక్ వచ్చే ప్రమాదం నెలకొంది. ఈ సమాచారాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న పెద్దషాపూర్ ఏఈ సురేష్‌రెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. చిన్న పడవలో సిబ్బందిని అక్కడకు పంపించి తీగలను సరి చేయించారు. అనంతరం కరెంటు సరఫరాను పునరుద్ధరించారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్

శంషాబాద్ రూరల్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. శనివారం పెద్దషాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో వివిధ గ్రామాలకు చెందిన గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్సవాల సమయంలో తీసుకునే జాగ్రతలు, పాటించాల్సిన నిబంధనలను తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ మూర్తుల ఊరేగింపుతో జాతర ప్రారంభం



శంషాబాద్ రూరల్: సిద్దులగుట్ట (శ్రీ వెండికొండ సిద్ధేశ్వరస్వామి) జాతర సందర్భంగా శనివారం ఉత్సవ మూర్తులను ఊరేగించారు. పట్టణంలోని బసవేశ్వరాలయంలో రుద్రాభిషేకం అనంతరం పల్లకిలో సిద్ధుల గుట్ట ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయంలో గణపతి, ఆంజనేయస్వామి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చేయూత పింఛన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలి

శంషాబాద్ రూరల్: పట్టణంలో ఈ నెల 18న నిర్వహించనున్న చేయూత పింఛన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఉపేందర్, ఎంఎస్‌పీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం.యాదగిరి శనివారం పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లిలో ఈ సందర్భంగా చేయూత పింఛన్‌దారుల సమావేశం నిర్వహించారు. వికలాంగుల పెన్షన్లు రూ. 6 వేలు, చేయూత పింఛన్‌దారులకు రూ. 4 వేలు పెంచాలని డిమాండ్‌లతో మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని బేగం ఫంక్షన్‌హాలులో మధ్యాహ్నం జరిగే ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంషాబాద్ ఇంచార్జి కె.రమేష్, అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర బాధ్యులు ఎం.రత్నం, ఎంఎస్‌ఎఫ్ నాయకులు పాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ రోడ్లపై నడ్డివిరిచే గుంతలు!

- ప్రధాన రహదారులన్నీ గుంతలమయం
- వాహనదారులు, పాదచారులకు తప్పని ప్రమాదాలు
- పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



భారీ వర్షాలకు గుంతలమయమైన అత్తాపూర్ ప్రధాన రహదారులు

అత్తాపూర్: పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా తయారయ్యాయి అత్తాపూర్ పరిధిలోని ప్రధాన రహదారులు. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది అత్తాపూర్ ప్రధాన రహదారి పి.వి.నర్సింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే 123 పిల్లర్ నుంచి గ్రామానికి వెళ్లే రహదారి. ఈ రహదారి మొత్తం గుంతలమయంగా తయారైంది.

◆ అత్తాపూర్ ప్రాంతానికి ఉన్న బ్రాండ్ నేమ్‌ను బహుళ అంతస్తుల నిర్మాణదారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారే తప్ప స్థానికంగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదంటూ స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇటీవల నిర్మాణదారులు వారు చేపడుతున్న నిర్మాణాలకు విల్లాలకు వెళ్లాలనుకునే వినియోగదారుల కోసం కిలోమీటర్ నుంచి రెండు మూడు కిలోమీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణాలతో పాటు డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించారు. నిర్మాణాల అవసరాల నిమిత్తం రోజుకు భారీ వాహనాల ద్వారా వారికి అవసరమయ్యే వస్తు సామగ్రిని చేరవేసుకుంటున్నారు. స్థానికంగా ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో రోడ్డు నిర్మాణాలు ఎక్కడకక్కడ పెచ్చులు పెచ్చులుగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయి.

◆ అత్తాపూర్ గ్రామ సర్పంచ్ దివంగత మాజీ నేత కొండకళ్ల కాంతారెడ్డి ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి మాత్రమే స్పష్టంగా కనిపిస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోతుందని కేవలం పండగలు, పబ్బాలకు మాత్రమే ట్రూత్ పాలిష్ పనులు చేపడుతూ మమా అని పిస్తున్నారన్నారు.

◆ అత్తాపూర్ పరిసరాలో పూర్తిస్థాయిలో అంతర్గత డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పక్కా రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ముంపు బారిన ఎర్రకుంటతండా

- భారీ వర్షానికి పోటెత్తిన వరద
- అర్ధరాత్రి ఇళ్లల్లోకి వరద నీరు
- ఆందోళనలో ఎర్రకుంటతండావాసులు

శంషాబాద్ రూరల్: భారీ వర్షానికి తండా ముంపునకు గురైంది. రహదారి వద్ద వరదనీరు నిలిచి దుకాణాలు నీట మునిగాయి. శుక్రవారం రాత్రి మండల పరిధిలో కురిసిన వానకు ఎర్రకుంటతండాను వరద ముంచెత్తింది. ఎగువ భాగంలోని పెద్దషాపూర్ ప్రాంతం వైపు నుంచి భారీగా వరద రావడంతో తండాలో సుమారు పది ఇళ్లలోకి నీరు చేరింది. అర్ధరాత్రి ఇళ్లల్లోకి వరద రావడంతో తండావాసులు ఆందోళనకు గురయ్యారు. మరో వైపు కవేలిగూడ చౌరస్తా వద్ద రోడ్డు పక్కన వరద నీరు దుకాణాల్లోకి చేరింది. ఇక్కడ శంషాబాద్–షాబాద్ రహదారి కింద నుంచి వరద ముందుకు వెళ్లే మార్గం మూసుకుపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వరదనీరు నిలిచిపోయి దుకాణాల్లోకి చేరుతుంది.

వాగుల్లో భారీ వరద..

ఎంటేరు వాగు, ఈసీ వాగులో భారీగా వరద పారింది. పాల్మాకులలోని మైసమ్మ చెరువు అలుగు పోయడంతో ఈ వరద ఎంటేరువాగులో నుంచి పారింది ఈ రెండు వాగుల్లోని వరద నీరు హిమాయత్‌సాగర్ జలాశయానికి చేరుతుంది.



ఎర్రకుంటతండాలోకి చేరిన వరదనీరు



కవేలిగూడ చౌరస్తాలో రహదారి పక్కన నిలిచిన వరద

రక్తదానం ప్రాణదానంతో సమానం

బండ్లగూడ: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే అది వారికి ప్రాణ దానం చేసిన దానితో సమానమని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదయ్య అన్నారు. రక్తదానం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించి ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నిర్వాహకులు జయసింహ, నికితల కోరారు. వారి ఆధ్వర్యంలో గిరిధారి అవిష్కలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ బీజేఎంసీ సభ్యులు వినాయ్‌రెడ్డి, నరేందర్‌బాబు, హరీష్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి, అశోక్, రమీజ్, నందూరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

కిందపడ్డ గణనాథుడి విగ్రహం



పల్లెచెరువు వద్ద రోడ్డుపై పడిన గణనాథుడి విగ్రహం

దుర్గానగర్ ప్రాంతంలో స్తంభించిన ట్రాఫిక్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదవశాత్తు ఓ ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న గణనాథుడి విగ్రహం రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివరాలివీ... ధూల్‌పేట్ నుంచి చంద్రాయణగుట్టకు ఓ భారీ గణనాథుడిని నిర్వాహకులు తీసుకెళ్తున్నారు. దుర్గానగర్ (పల్లెచెరువు) ప్రాంతానికి చేరుకోగానే ఒక్కసారిగా గణనాథుడి విగ్రహం కిందపడిపోయింది. దీంతో పల్లెచెరువు నుంచి ఆరాంఘర్ వైపు, పల్లెచెరువు నుంచి కాటేదాన్ వైపు వెళ్లే వాహనాలు పూర్తిగా ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించడంతో ఇన్‌స్పెక్టర్ రాజు నేతృత్వంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో విగ్రహానికి పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



దుర్గానగర్ ప్రాంతంలో స్తంభించిన ట్రాఫిక్



ప్రమాదకరంగా నాలా

రాజేంద్రనగర్: హైదర్‌గూడ పరిధిలోని లక్ష్మీనగర్‌లో రోడ్డు కోసం తవ్వారు. పక్కనే ఉన్న నాలా పై కప్పును మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ నాలా కాస్తా స్థానికులు, వాహనదారులకు మాదకరంగా మారింది. గడచిన నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఈ దారి గుండా వెళ్లాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు గుండా రాకపోకలు సాగించాలంటే వరద నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'హరేకృష్ణ' సేవలు అమోఘం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



జగన్నాథునికి అభిషేకం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మణికొండ: ప్రపంచ వ్యాప్తంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ వారు చేస్తున్న సేవలు అమోఘమని వారి బాటలో అందరూ భక్తి భావం, సేవా భావం పెంచుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న హెరిటేజ్ టవర్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కృష్ణుడి పూజల్లో పాల్గొని, జగన్నాథుడికి అభిషేకం నిర్వహించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలతో పాటు మన దేశంలో పలు రాష్ట్రాలలో వారి సేవలు అందిస్తున్నారన్నారు. అటు భక్తి భావం, ఇటు సేవా కార్యక్రమాలతో అనేక సంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ సేవలకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాజేంద్రనగర్ ఇంచార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి శిశు మందిర్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలోని చిన్నారుల దృశ్యం

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



నార్సింగి శారదా విద్యానికేతన్‌లో...





శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

రాజేంద్రనగర్: శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కమిటీ కార్యదర్శి గొట్టి అనిల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వందన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సమితి ఉపాధ్యక్షుడు సదాల చంద్రారెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల చక్కటి వేషధారణతో శివరాంపల్లి గ్రామంలోని అన్ని వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. నేతాజీ యువజన సంఘం వద్ద విద్యార్థులు యోగ్ చాప్, చెక్క భజన, డంబుల్స్ వంటి సాంస్కృతిక కళాత్మక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రదర్శించారు. అనంతరం పాఠశాలలో ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. సమితి అధ్యక్షుడు పెండ్యాల చంద్రమోహన్, సమితి ఎగ్జిక్యూటివ్ మెంబర్ కందాడ జనార్దన్ రెడ్డి, శ్రీరాగి చెట్టి యాదిరెడ్డి, కమిటీ కార్యదర్శి గొట్టి అనిల్, సభ్యులు ఆకుల జగదీష్, పాఠశాల ప్రధానాచార్యులు కావలి శ్రీనివాస్, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

హైదర్షాకోట్‌లో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధిక, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబు చేశారు. హైదర్షాకోట్ ఎస్ఎంపీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులతో ఉట్టి కొట్టే కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

నార్సింగి, మంచిరేవులలో...

మణికొండ: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శనివారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు, ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు సహస్ర కలశాభిషేకం, స్నపనము, హారతి, 1008 కళశాలతో అభిషేకం, సాయంత్రం స్వామి వారి ఊంజల్ సేవ, రాత్రి ఉట్టి కొట్టే ఉత్సవాలను నిర్వహించారు. రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌తో పాటు స్థానిక నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు పాఠశాలల్లో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు, చిన్ని కృష్ణులు, రాధలుగా అలంకరించుకుని పోటీలలో పాల్గొన్నారు.







హైదర్షాకోట్‌లోని ఎస్ఎంపీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో...





ఉట్టి కొడుతున్న దృశ్యం



మంచిరేవులలో పూజలలో పాల్గొన్న భక్తులు